క్లుప్తంగా...

సరోజినిదేవి కంటి ఆస్పత్రి ఉద్యోగికి ఉత్తమ సేవా అవార్డు


అవార్డుతో శివ

గోల్కొండ: అవార్డులు మరింత బాధ్యతను పెంచుతాయని సరోజిని దేవి కంటి ఆస్పత్రి కార్యాలయ ఆఫీస్ అసిస్టెంట్ శివ అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఆరోగ్యశాఖ వారు ఆయనకు ఉత్తమ సేవా అవార్డు అందజేశారు. అవార్డు అందుకున్న సందర్భంగా సరోజినిదేవి కంటి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ డాక్టర్ రాజలింగం, ఆర్ఎంఓ నజాబి తదితరులు ఆయనను అభినందించారు.

బీజేపీ బలోపేతానికి కృషి



చార్మినార్: పాతబస్తీలోని పార్టీని మరింత బలోపేతానికి కృషి చేయాలని బీజేపీ గోల్కొండ జిల్లా ప్రధాన కార్యదర్శి టి. ఉమామహేంద్ర అన్నారు. పురానాపూల్ దర్వాజా వద్ద బుధవారం రాత్రి ఆయన జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈసారి జరిగే ఎన్నికలను పురస్కరించుకొని ఇప్పటి నుంచే పార్టీను మరింత బలోపేతం చేయడానికి ప్రతి కార్యకర్త, నాయకుడు కృషి చేయాలన్నారు. చార్మినార్ నియోజకవర్గం బీజేపీ కన్వీనర్ సురేందర్, ప్రవీణ్ బాగ్డీ, నరేందర్, తాహేల్, కునాల్ రావు పాల్గొన్నారు.

ఆసిఫ్‌నగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా కాశీగడ్డం

విజయనగర్‌కాలనీ: ఆసిఫ్‌నగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా కాశీగడ్డం నియమితులయ్యారు. 2009 బ్యాచ్‌కు చెందిన ఇతను మహబూబ్‌నగర్‌లో ఎస్ఐగా, రాంగోపాల్‌పేట ఇన్‌స్పెక్టర్‌గా, 100లో విధులు నిర్వహించారు. బాధ్యతలు చేపట్టిన కాశీగడ్డం మాట్లాడుతూ.. పోలీస్‌స్టేషన్ పరిధిలోని ప్రధాన కూడళ్లలో ముఖ్యంగా మెహిదీపట్నం చౌరస్తా, ఆసిఫ్‌నగర్ చంద్రభవన్ చౌరస్తా, మల్లేపల్లి ప్రధాన కూడలి తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ లేకుండా చర్యలు తీసుకుంటానన్నారు.

వార్డు కార్యాలయం సిద్ధం


ప్రారంభానికి సిద్ధమైన గోల్కొండ వార్డు కార్యాలయం

గోల్కొండ: గోల్కొండలో బల్దియా వార్డు కార్యాలయం ప్రారంభానికి సిద్ధమైంది. సుదీర్ఘ కాలంగా గోల్కొండ కోట మెయిన్‌గేటు ఎదురుగా గల భవనంలో వార్డు కార్యాలయం కొనసాగుతుంది. అయితే వార్డు కార్యాలయాల ఆధునీకరణ, ప్రజలకు మరిన్ని విస్తృత సేవలు అందించేందుకు బల్దియ వారు వార్డు కార్యాలయానికి కొత్త రూపులు ఇస్తున్నారు. ఇందులో భాగంగానే ప్రస్తుతం ఉన్న కార్యాలయానికి కొత్త హంగులు చేర్చారు. కార్యాలయానికి వచ్చే వారి కోసం ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు.

శ్రీశైలం పుణ్య క్షేత్రానికి అనాథ చిన్నారులు



అఫ్జల్‌గంజ్: అనాథ చిన్నారులను ప్రతిఒక్కరూ ఆదుకోవాలని భాగ్యనగర్ అయ్యప్ప సేవా సమితి (బాస్) అధ్యక్షులు కె.రాధాకృష్ణ, ప్రధాన కార్యదర్శి విజయ్‌భాస్కర్, కోశాధికారి మెడిశెట్టి రాకేశ్ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఉస్మాన్‌గంజ్‌లోని బాస్ కార్యాలయం నుంచి 42 మంది అనాథ చిన్నారులను ప్రత్యేక బస్సులో శ్రీశైల పుణ్యక్షేత్రానికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ.. బాస్ ఆధ్వర్యంలో అనాథ చిన్నారులకు విద్య, వసతి, భోజనంతో పాటు సంగీతం, కరాటే, వివిధ క్రీడల్లో తర్ఫీదునిస్తున్నామని వారు తెలిపారు. వారికి దైవభక్తి కలగాలని శ్రీశైల పుణ్యక్షేత్రానికి తీసుకెళ్లామన్నారు. ఉస్మానియాలో ప్రతిరోజూ రోగులు, వారి సహాయకులకు దాదాపు 15 వేల లీటర్ల ఆర్ఓ ఉచిత తాగు నీటిని అందజేస్తున్నామన్నారు.

ఉపాధ్యాయుడి అదృశ్యం

శంషాబాద్: నీళ్ల బాటిల్ కొనుక్కుని వస్తానంటూ కారు దిగిన ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు అదృశ్యమైన ఘటన గురువారం వెలుగుచూసింది. నాదర్‌గుల్‌లో నివాసముంటున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు గుడ్ల రాఘవేందర్‌రావు (50) అతడి భార్య అంజమ్మ ఈనెల 3 మహబూబ్‌నగర్‌కు వెళ్లి అదే రోజు రాత్రి తిరిగి ఇంటికి బయలుదేరారు. శంషాబాద్ పట్టణానికి వచ్చిన తర్వాత బజాజ్ ఎల్రక్టానిక్ షోరూం సమీపంలో నీళ్ల బాటిల్ కొనుక్కుని వస్తానని వెళ్లి తిరిగి రాలేదు. అన్ని చోట్లా వెతికినా ఆచూకి లభించకపోవడంతో గురువారం ఆర్‌జీఐఏ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ప్రమాదకరంగా విద్యుత్ వైర్లు

- తరచూ అగ్ని ప్రమాదాలు
- అడ్డదిడ్డంగా ఏర్పాటు చేసిన వైర్లతో షార్ట్ సర్క్యూట్
- పట్టించుకోని అధికారులు
- విస్మరిస్తున్న క్షేత్రస్థాయి పరిశీలన


సాలేగూడుల్లా విద్యుత్ వైర్లు


దారుషిఫాలో ట్రాన్స్‌ఫార్మర్ పేలిపోవడంతో జరిగిన అగ్ని ప్రమాదం (ఫైల్)

చార్మినార్: పాతబస్తీలో తరచూ విద్యుత్ అగ్ని ప్రమాదాలు జరుగుతున్నాయి. దక్షిణ మండలంలోని పాతబస్తీలో ఫిబ్రవరి నుంచి మే వరకు.. అంటే గడచిన 4 నెలల్లో 10 విద్యుత్ అగ్ని ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. పెద్ద ఎత్తున ఆస్తి నష్టం జరిగింది. ఈ ప్రమాదాలన్నీ విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగాయని సంబంధిత అగ్నిమాపక సిబ్బంది చెబుతున్నారు. ఇందులో కొన్ని సాంకేతిక కారణాలు కాగా.. మరికొన్ని సంబంధిత విద్యుత్ సిబ్బంది, యజమానుల నిర్లక్ష్యం కారణంగానే జరిగాయంటున్నారు. పాతబస్తీలో అడ్డదిడ్డంగా ఉన్న విద్యుత్ సరఫరా వ్యవస్థే విద్యుత్ ప్రమాదాలకు ప్రధాన కారణాలని పాతబస్తీ ప్రజలంటున్నారు. ఇళ్లకు అతి సమీపంలో వీధి స్తంభాల విద్యుత్ తీగలుండడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అడ్డదిడ్డంగా ఉన్న విద్యుత్ వైర్లు, సర్వీస్ వైర్లు శిథిలావస్థకు చేరుకున్నా.. సంబంధిత అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయి పరిశీలన చేయకపోవడంతో వాటితో ప్రమాదాలు పొంచి ఉంటున్నాయి. వీటికి తోడు లోకల్ స్టార్ వైర్లు, ఇంటర్‌నెట్ వైర్లు.. టెలిఫోన్ వైర్లు ఇలా అన్ని రకాల వైర్లన్నీ వీధి స్తంభాలకే కడుతున్నారు.

ఫిబ్రవరి నుంచి ఇప్పటి వరకు జరిగిన అగ్ని ప్రమాదాలు..

- ఫిబ్రవరి 11న, మీర్‌చౌక్ పోలీసు స్టేషన్ పరిధిలోని దారుషిఫా వద్ద ఉన్నటుండి ట్రాన్స్‌ఫార్మర్ పేలిపోవడంతో పక్కనే ఉన్న టైర్లు కాలి బూడిదయ్యాయి. రాత్రిపూట జరిగిన ఈ ఘటనతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. – అదే నెల 19న, డబీర్‌పురా పోలీస్ స్టేషన్ పరిధిలోని ఫర్హత్‌నగర్‌లో ఉన్న సప్లయింగ్ కంపెనీలో షార్ట్ సర్క్యూట్ జరిగి విద్యుత్ ప్రమాదం సంభవించింది. పెద్ద ఎత్తున ఆస్తినష్టం జరిగింది.
- అలాగే మార్చి 2న, కాలాపత్తర్ పోలీసు స్టేషన్ పరిధిలో, 11న, బహదూర్‌పురా పీఎస్ పరిధిలోని మీరాలం ట్యాంక్ వద్ద, 18న, కాలాపత్తర్ పీఎస్ పరిధిలో ప్లాస్టిక్ గోదాంలో అగ్ని ప్రమాదం జరిగిది.
- ఏప్రిల్ 5న, మొఘల్‌పురా పీఎస్ పరిధిలోని ఆస్రా ఆస్పత్రి ఎదురుగా, మే 20న, హుస్సేనీఆలం పోలీస్‌స్టేషన్ పరిధిలోని స్పేర్ పార్ట్స్ దుకాణంలో షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం జరిగింది.
- ఇలా నెలకు ఒకటో రెండో అగ్ని ప్రమాదాలు సంభవిస్తున్నప్పటికీ.. అటు అధికారులు గానీ, ఇటు యజమానులు గానీ పట్టించుకోవడం లేదు.

క్షేత్రస్థాయి పరిశీలన కరువు..

- బస్తీల్లో ఏర్పాటు చేసిన వీధి స్తంభాలకు ఉన్న వైర్లను పట్టించుకోవడంలో సంబంధిత సెక్షన్ విద్యుత్ సిబ్బంది పూర్తిగా విఫలమవుతున్నారు.
- అధికారుల అలసత్వం.. సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా తరచూ విద్యుత్ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.
- కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు ఇళ్లను ఆనుకునే ఉండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. మరికొన్ని ప్రాంతాల్లో ఇంటి బాల్కానీ పక్క నుంచే విద్యుత్ వైర్లు వెళ్తుండడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.
- బాల్కానీలో చిన్నారులు ఆటలాడుతూ వైర్లను పట్టుకునేంత అతి తక్కువ ఎత్తులో విద్యుత్ వైర్లున్నాయి. దీంతో అక్కడక్కడ విద్యుత్ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. స్తంభాలకు ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలతో అప్పుడప్పుడు విద్యుత్ సరఫరాకు కూడా అంతరాయం కలుగుతోంది.
- టీఎస్ఎస్‌పీడీసీఎల్ దక్షిణ మండలంలో చార్మినార్, ఆస్మాన్‌ఘడ్, బేగంబజార్ డివిజన్లున్నాయి. వీటి పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ వైర్లు కిందికి వేలాడుతూ ప్రమాదాలకు కారణమవుతున్నాయి.
- ఆస్మాన్‌ఘడ్ విద్యుత్ సబ్ డివిజన్ పరిధిలోని ఆస్మాన్‌ఘడ్, గాంధీనగర్, హమాలీబస్తీ, ఎస్టీ కాలనీ తదితర బస్తీల్లో ఎన్నో ఏళ్లుగా స్థానికులు ఎల్టీ, హెచ్‌టీ విద్యుత్ వైర్లతో ప్రమాదాలు ఎదురవుతున్నాయని సంబంధిత విద్యుత్ అధికారులకు ఎన్నోసార్లు వినతి పత్రాలు అందజేశారు.
- అలాగే చార్మినార్, యాకుత్‌పురా, బహదూర్‌పురా, చాంద్రాయణగుట్ట తదితర నియోజకవర్గాల పరిధిలోని ఏ బస్తీలో చూసినా సాలేగూడుల్లాంటి అడ్డదిడ్డమైన విద్యుత్ వైర్లు కనిపిస్తాయి.

సమస్యల పరిష్కారానికి సిద్ధం


వినతిపత్రాలు తీసుకుంటున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: సమస్యల పరిష్కారానికి తానెప్పుడూ సిద్ధంగా ఉంటానని ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. గురువారం టోలిచౌకి మేరాజ్ కాలనీలోని ఆయన కార్యాలయానికి కార్వాన్, లంగర్‌హౌస్ తదితర ప్రాంతాలకు చెందిన పలువురు వ్యక్తులు ఆయనను కలిసి సమస్యలపై వినతిపత్రాలు సమర్పించారు. వినతిపత్రాలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. బస్తీల, కాలనీల సమస్యలతో మాత్రమే తన వద్దకు రావాలని వ్యక్తి గత సమస్యలు, తమ నిర్మాణం, తదితర విషయాలపై తాను ఫిర్యాదులు తీసుకోనని ఆయన స్పష్టం చేశారు. అయితే ఈ వేసవిలో తాగునీటి సరఫరాపై వచ్చే ఫిర్యాదులు గణనీయంగా తగ్గాయని ఆయన అన్నారు. తాగునీటి సరఫరాకు కోతలు విధించలేదని ఆయన అన్నారు. అయితే తాను గతంలోనే లోప్రెషర్ నీటి సరఫరా ప్రాంతాలను గుర్తించి ఆయా ప్రాంతాల్లో నీటిసరఫరాలో బూస్టర్లను ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించడం జరిగిందన్నారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతులు నిర్వహించి వాటి పటిష్టమైన కంచె ఏర్పాటు చేయాలని వారిని ఆదేశించామన్నారు. ఈ కార్యక్రమంలో నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్ తదితరులున్నారు.

సమాజ్‌ల సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి


నందకిశోర్ వ్యాస్ బిలాల్‌ను సత్కరిస్తున్న సూర్యప్రకాష్ జైస్వాల్, స్వరూప్‌కుమార్ జైస్వాల్

అబిడ్స్: సమాజ్‌ల సంక్షేమానికి సీఎం కేసీఆర్ ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్ పేర్కొన్నారు. ప్రతి సమాజం కోసం అండగా ఉండి వారి ప్రగతికి, సంక్షేమానికి, అభివృద్ధికి పెద్దపీట వేస్తున్న ఘనత బీఆర్ఎస్ పార్టీదే అన్నారు. గోషామహల్ రోడ్డులోని పార్టీ కార్యాలయంలో హైదరాబాద్ జైస్వాల్ సేవాసమితి అధ్యక్షుడు డాక్టర్ సూర్యప్రకాష్ జైస్వాల్, సభ్యులు స్వరూప్‌కుమార్ జైస్వాల్, రాజేందర్ ప్రసాద్ జైస్వాల్, రాధారామన్ జైస్వాల్, వికాస్ జైస్వాల్, అనిల్ జైస్వాల్‌లతో పాటు పలువురు నాయకులు ఇటీవల బీఆర్ఎస్ ఇన్‌చార్జ్‌గా నియమితులైన నందకిశోర్ బిలాల్‌ను సత్కరించి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జైస్వాల్ సమాజ్ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. జైస్వాల్ సమాజ్‌కు తాను అండగా ఉండి వారికి ఎలాంటి సమస్యలు ఉన్నా పరిష్కరిస్తానన్నారు. వారి సమస్యలన్ని పలు ప్రభుత్వ శాఖల అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం చేసేందుకు తాను పాటుపడుతానన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పూజవ్యాస్ బిలాల్, పప్పు మాత్రే, ప్రదీప్‌రాజ్, కోటి శైలేష్ కురుమ తదితరులు పాల్గొన్నారు.

బోనాలలో వృత్తిదారుల సేవలను గుర్తించాలి


కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న వృత్తిదారుల సంఘం ప్రతినిధులు

చాంద్రాయణగుట్ట: పాతబస్తీ బోనాలలో అమ్మవారి సేవలో కొనసాగే కులవృత్తులను గుర్తించాలని వృత్తిదారుల సంఘం ప్రతినిధులు హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌ను కోరారు. ఈ మేరకు గురువారం వారు కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. పాతబస్తీలో అనాదిగా అమ్మవారి ఆలయాల వద్ద వృత్తిదారులు అమ్మవారి సేవలో కొనసాగుతూ వస్తున్నారన్నారు. కాని గుర్తింపు మాత్రం దక్కడం లేదన్నారు. ఇప్పటి నుంచైనా తమకు గుర్తింపు కార్డు, యూనిఫారం, గౌరవ వేతనం ఇవ్వాలని సంఘం అధ్యక్షుడు పేరోజీ మహేశ్వర్, ప్రధాన కార్యదర్శి జ్ఞానేశ్వర్, కోశాధికారి గట్టు సుదర్శన్, ఉపాధ్యక్షులు బర్రెల జగదీష్, గట్టు బాబులతో పాటు బొడ్డుపల్లి బాలీశ్వర్, భిక్షపతి, నరేష్, దేవేందర్, రామకృష్ణ, నవీన్, బాలరాజ్ తదితరులు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం తరఫున అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తానని కలెక్టర్ హామీ ఇవ్వడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు.

గోషామహల్ అభివృద్ధికి ప్రత్యేక కృషి


పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజాసింగ్, ఆనంద్‌కుమార్ గౌడ్

అబిడ్స్: గోషామహల్ నియోజక అభివృద్ధి ప్రత్యేక కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే రాజాసింగ్ పేర్కొన్నారు. నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో వేగవంతంగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు వివరించారు. గౌలిగూడలో నూతన సివరేజీ అభివృద్ధి పనులను బీఆర్ఎస్ నాయకుడు ఆనంద్‌కుమార్‌గౌడ్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం రాజాసింగ్ మాట్లాడుతూ.. నియోజకవర్గం నలుమూలలా అన్నివర్గాల ప్రజల కోసం అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజలు ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కారం చేస్తామన్నారు. బీఆర్ఎస్ నాయకులు ఎం.ఆనంద్‌కుమార్‌గౌడ్, బీజేపీ నాయకులు కృష్ణ, భీశ్వ ఓంప్రకాష్, శైలేందర్ యాదవ్, శ్రీనివాస్, రాజు తదితరులు పాల్గొన్నారు.

వైద్య శాఖ ఆధ్వర్యంలో దశాబ్ది వేడుకలు


వేడుకల్లో ఎస్‌పీహెచ్ఓ డాక్టర్ మల్లేశ్వరి, కార్పొరేటర్లు లాల్‌సింగ్, రాకేష్ జైస్వాల్

అబిడ్స్: వైద్యశాఖ ఆధ్వర్యంలో దశాబ్ది వేడుకలు ఘనంగా నిర్వహించారు. అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ల ఎస్‌పీహెచ్ఓ డాక్టర్ మల్లేశ్వరీ ఆధ్వర్యంలో వేడుకలు జోరుగా చేపట్టారు. వైద్యులను, మహిళలను సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా మల్లేశ్వరి మాట్లాడుతూ.. అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ల వైద్యులు కరోనా కాలంలో కూడా అమోఘమైన సేవలు అందించారని కొనియాడారు. తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా వైద్యులు ప్రజల కోసం పనిచేస్తున్నారని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు లాల్‌సింగ్, రాకేష్ జైస్వాల్, బీజేపీ నాయకులు కృష్ణ, అవినాష్, డాక్టర్ అరవింద్, డాక్టర్ అన్నపూర్ణ, డాక్టర్ రామ్‌చందర్, డాక్టర్ సాయిప్రసన్న, డాక్టర్ రఫత్, డాక్టర్ సనా, డాక్టర్ బుష్రా, డాక్టర్ దీపక్, డాక్టర్ భరత్, డాక్టర్ అరుణ్ దీప్, డాక్టర్ రసూల్ పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

- ప్రమాదకరంగా కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్
- కిందికి వేలాడుతున్న 11కేవీ కరెంటు వైరు
- భయాందోళనలో స్థానికులు


కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్

శాలిబండ: శాలిబండ డివిజన్‌లోని ఖాజీపురాలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు రక్షణ కంచె లేకపోవడంతో స్థానికంగా ప్రమాదకరంగా మారింది. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద నుంచి ప్రతిరోజూ విద్యార్థులు, ప్రతి గురువారం కూరగాయల సంత జరుగుతుంది. దీంతో ఈ దారిలో వందల మంది రాకపోకలు సాగిస్తుంటారు. రక్షణ కంచె లేకపోవడంతో ఈ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని స్థానిక ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. అంతేకాకుండా ట్రాన్స్‌ఫార్మర్ వద్ద నుంచి 11కేవీ కరెంటు వైరు కిందికి వేలాడుతూ ప్రమాదకరంగా మారిందని పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానిక బస్తీవాసులు, వ్యాపారస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్‌తో ఎలాంటి ప్రమాదం జరగకుండా ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు వెంటనే స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ చుట్టు ప్రహరీ రక్షణ కంచెను ఏర్పాటు చేయాలని స్థానికులు, వ్యాపారస్తులు కోరుతున్నారు.

బుద్వేల్‌లో బొడ్రాయి వార్షికోత్సవం



రాజేంద్రనగర్: బుద్వేల్‌లో బొడ్రాయి వార్షికోత్సవం పూజా కార్యక్రమాలను గురువారం ఘనంగా నిర్వహించారు. బొడ్రాయిని నెలకొల్పి ఆరేళ్లు పూర్తయిన సందర్భంగా ఈ పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఉదయం అభిషేకం, అనంతరం పూజా కార్యక్రమాలను ప్రారంభించారు. వార్షికోత్సవం సందర్భంగా బొడ్రాయితో పాటు పరిసర ప్రాంతాలను వివిధ రకాల పూలతో అందంగా తీర్చిదిద్దారు. బుద్వేల్‌తో పాటు స్థానిక ప్రాంతాలకు చెందిన బస్తీ, కాలనీ మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు తగు ఏర్పాట్లు చేశారు.

21న అన్ని ఆలయాల్లో అర్చక, అభిషేకం, అన్నదానం


మాట్లాడుతున్న శ్రీరంగం గోపికృష్ణమాచార్యులు

సుల్తాన్‌బజార్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆధ్యాత్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 21న గ్రేటర్‌లోని అన్ని ఆలయాల్లో అర్చక, అభిషేకం, హోమాలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు దూప దీప నైవేద్య అర్చక సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు శ్రీరంగం గోపికృష్ణమాచార్యులు తెలిపారు. ఈ మేరకు గురువారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మొట్టమొదటి సారిగా జీహెచ్ఎంసీ పరిధిలోని దూప దీప నైవేద్య పథకాన్ని ప్రవేశపెట్టి తొలి విడతలో వంద ఆలయాలను ఎంపిక చేసినందుకు సీఎం కేసీఆర్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో సంఘం మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు రఘునాథచార్యులు, గ్రేటర్ ఉపాధ్యక్షుడు చంద్రప్రకాష్, కార్యనిర్వాహక కార్యదర్శి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు


పూజల్లో బీఆర్ఎస్ కార్వాన్ ఇన్‌చార్జి జీవన్ సింగ్, ముదత్యాల భాస్కర్ తదితరులు

గోల్కొండ: రాష్ట్రాన్ని తొమ్మిదేళ్లుగా సుభిక్షంగా సీఎం కేసీఆర్ పాలిస్తున్నారని బీఆర్ఎస్ పార్టీ కార్వాన్ నియోజకవర్గ ఇన్‌చార్జి టి. జీవన్ సింగ్ అన్నారు. గురువారం పార్టీ ఆధ్వర్యంలో కార్వాన్‌లోని దర్బార్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో భారీ మెజార్టీతో బీఆర్ఎస్ అధికారంలోకి రావాలని అమ్మవార్లను కోరుకున్నారు. ఈ సందర్భంగా జీవన్ సింగ్ మాట్లాడుతూ.. సంక్షేమ పథకాల అమలు, శాంతి భద్రతలకు తెలంగాణ రాష్ట్రం ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందన్నారు. జన్మదిన సందర్భంగా శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. పట్లూరి రఘు, దుర్గరాజ్, రమేష్, సంపత్, ఆశిక్ బాబు, సంతోష్, రాజేష్ తదితరులున్నారు.

ఘనంగా దశాబ్ది ఉత్సవాలు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాషా ఖాద్రీ

యాకుత్‌పురా: తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గురువారం తలాబ్‌కట్టా షార్జా ఫంక్షన్ హాల్‌లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రీ మాట్లాడుతూ.. ప్రభుత్వం మహిళలు, కిశోర బాలికలు, గర్భిణులకు అందించే సంక్షేమ పథకాలను అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అవగాహన కల్పించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో తలాబ్‌చంచలం, మొఘల్‌పురా డివిజన్ల కార్పొరేటర్లు డాక్టర్ సమీనా బేగం, నస్రీన్ సుల్తానా, యాకుత్‌పురా నియోజకవర్గం నోడల్ అధికారి అంకేశ్వర రావు, యుపీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ ఆయేషా ముదాషీర్, డాక్టర్ సమీనా, ఐసీడీఎస్ చార్మినార్ ప్రాజెక్టు సెక్టార్ సూపర్‌వైజర్ సావిత్రి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ధోబీఘాట్‌లో బోర్‌వెల్


ధోబీఘాట్‌లో బోర్‌వెల్ వేస్తున్న దృశ్యం

నాంపల్లి: మల్లేపల్లి డివిజన్ ధోబీఘాట్‌లో సికింద్రాబాద్ ఎంపీ నిధులతో బోర్‌వెల్‌ను వేశారు. నీటి ఇక్కట్లతో అలమటిస్తున్న స్థానికులు ఇటీవల డివిజన్ పర్యటనకు వచ్చిన కేంద్ర మంత్రి, సికింద్రాబాద్ ఎంపీ జి.కిషన్‌రెడ్డికి బోర్‌వెల్ వేయాలని విజ్ఞప్తి చేశారు. స్థానికుల విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ధోబీఘాట్‌లో బోరు వేయడానికి సహకరించారు. బస్తీలో బోరును వేసి స్థానికుల కనీస అవసరాన్ని తీర్చారు. హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ఎస్సీ మోర్చా నగర అధ్యక్షుడు జేఎల్.రాహుల్‌చంద్ర, బీజేవైఎం నగర కార్యదర్శి విజయ్ సింగ్, నాంపల్లి కన్వీనర్ పవన్ కుమార్, జిల్లా ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షులు వై.రమేష్ బాబు, ఆదర్శవిద్యా రజక యువ సమితి అధ్యక్షులు ఎం.భరత్ సింగ్, నేతలు హెచ్ఎంటీ శంకర్, టి.రమేష్ సింగ్. కె.నరేష్ సింగ్, టి.నరేష్ సింగ్, జి.లఖన్ సింగ్, రిషీభాయ్ పాల్గొన్నారు.

హైకోర్టు గేట్ ఎదుట బ్యానర్‌తో ప్రదర్శన



చార్మినార్: మాగ్నా కార్టాడేను పురస్కరించుకుని భారత ప్రజా న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో గురువారం హైకోర్టు ప్రధాన గేట్ ఎదుట బ్యానర్‌తో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు వెంకన్న, సురేష్‌కుమార్, దశరథ్, రత్నం, రాహుల్, రిజ్వాన్ తదితరులు మాట్లాడుతూ.. బ్రిటన్ రాచరిక వ్యవస్థకు వ్యతిరేకంగా 1215లోనే అక్కడి ప్రజలు పోరాడి తొలి మానవ హక్కుల పత్రాన్ని రూపొందించుకున్నారన్నారు. 808 ఏళ్ల నాటి తొలి మానవ హక్కుల పత్రం విడుదలైన రోజును మాగ్నా కార్టాడేగా పరిగణిస్తారన్నారు. ప్రస్తుత ప్రభుత్వాలు మానవ హక్కులను ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

వేంకటేశ్వర ఆలయ కార్యనిర్వహణ అధికారిగా వేణుగోపాలరావు



సంతోష్‌నగర్: సంతోష్‌నగర్‌లోని వేంకటేశ్వర ఆలయానికి దేవాదాయ ధర్మదాయ శాఖ వారి ఉత్తర్వుల మేరకు బి.వేణుగోపాలరావు నూతన కార్యనిర్వహణ అధికారిగా బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పని చేసిన కె.జయంతి నల్లకుంటలోని రామాలయానికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేంకటేశ్వర ఆలయ పాలకమండలి సమన్వయంతో కలిసి పని చేస్తానన్నారు.

పారిశుద్ధ్య సిబ్బందికి చీరల పంపిణీ

గోల్కొండ: పారిశుద్ధ్య సిబ్బంది సేవలు వెలకట్టలేమని కార్వాన్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి టి. జీవన్ సింగ్ అన్నారు. గురువారం ఆయన కార్వాన్‌లో పారిశుద్ధ్య సిబ్బందికి చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేడు రోడ్లు అద్దంలా మెరుస్తున్నాయి అంటే దీని వెనుక పారిశుద్ధ్య సిబ్బంది కృషి ఎంతైనా ఉందన్నారు. ఆయన వెంట పలువురు బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

స్వీపింగ్ విధులకు హాజరుకాని కార్మికుల డబ్బులు స్వాహా

జియాగూడ: జీహెచ్ఎంసీ శానిటరి విభాగంలో స్వీపర్లు విధులకు రాని పక్షంలో వారి డబ్బులను మెషిన్ల ద్వారా వచ్చినట్లు ఫింగర్‌ప్రింట్స్ డబ్బులు దండుకుంటున్న ఓ వ్యక్తిని గురువారం అదుపులోకి తీసుకున్నట్లు కుల్సుంపురా పోలీస్‌స్టేషన్ ఎస్ఐ మక్బూద్ తెలిపారు. పోలీస్‌స్టేషన్ పరిధిలోని జియాగూడ సంజయ్‌నగర్ శివబాగ్ కాలనీలో ఉంటున్న సత్యనారాయణ జీహెచ్ఎంసీ శానిటరి విభాగంలో ఎస్ఎఫ్ఏగా గోషామహల్ సర్కిల్–14లో కాంట్రాక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. కొన్ని నెలల నుంచి స్వీపింగ్ యూనిట్‌లో హాజరుకాని కార్మికులు వచ్చినట్లు ఫింగర్ ప్రింట్ ద్వారా సుమారు ఐదుగురి డబ్బులను స్వాహా చేస్తున్నాడు. విశ్వసనీయ సమాచారం మేరకు సీసీఎస్‌కు చెందిన స్పెషల్ టీమ్ ఇన్‌స్పెక్టర్ గురునాయక్, కుల్సుంపురా పోలీసులు సంజయ్‌నగర్ శివ్‌బాగ్ కాలనీలోని సత్యనారాయణ ఇంటిపై దాడి చేసి పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు.

బోనాల నిర్వహణకు సంపూర్ణ సహకారం


ఎమ్మెల్యే కౌసర్‌కు గోల్కొండ కోట ఆహ్వాన పత్రాన్ని అందజేస్తున్న సాయిబాబాచారి తదితరులు

గోల్కొండ: గోల్కొండ కోట బోనాలు రాష్ట్రానికే గర్వకారణమని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. ఈనెల 22 నుంచి ప్రారంభం కానున్న గోల్కొండ కోట బోనాల ఆహ్వాన పత్రాన్ని అమ్మవారి వృత్తిపని సంఘం అధ్యక్షుడు బొమ్మల సాయిబాబాచారి గురువారం ఎమ్మెల్యేకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బోనాల ఏర్పాట్లలో వృత్తిపని వారి సంఘం వారి పాత్ర ఎంతో కీలకమని అన్నారు. ఈ కార్యక్రమంలో నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, మహంకాళి అమ్మవారి ఆలయ పూజారి సురేష్ చారి తదితరులున్నారు.